భక్తి సాధన

గోటేటి శ్రీరామారావు

పూర్వం రంగయ్య అనే ఒక వర్తకుడుండేవాడు. అతని భార్య రంగమ్మ. రంగమ్మకు దేవుడంటే భక్తి, దెయ్యమంటే భయమూ. వ్రతాలూ, పూజలూ, దానాలూ, ధర్మాలూ అంటే ఆమెకు యిష్టం. రంగయ్యకివేమీ కిట్టవు. పరమలోభి. నాస్తికుడు. ఎప్పుడూ వడ్డీకి వడ్డీ కట్టి రెట్టింపు లాభాన్ని లాగటం తప్పితే, మరొకటేమీ లేదు. ఏనాడూ 'కృష్ణా రామా' అన్న పాపాన పోలేదు.

ఆ వూరిలో రంగనాథస్వామి వారి కోవెలవుంది నిత్యం ఆ కోవెలలో ఏదో హరికథా కాలక్షేపమో గానకచ్చేరియో, భామకలాపమో, భరతనాట్యమో లేదా భగవద్గీతా పారాయణో జరుగుతూంటుంది. ప్రతి సాయంత్రము పురాణ కాలక్షేపం చేస్తారు. రంగయ్య ఒక్కనాడు కూడా పురాణం వినటంకాని, స్వామిసందర్శనంకాని చేసేవాడు కాదు.

భర్తయొక్క ఈ వికృతపు చేష్టలనుచూసి రంగమ్మ సహించలేకపోయేది. అతని వింతప్రవర్తనమూ, లోభిత్వమూ సుతరామూ ఆమెకు కిట్టవు. ఆమె ప్రతినిత్యమూ పురాణ శ్రవణమునకుగాని, హరికథా కాలక్షేపమునకు గాని పోయేది. స్వామిదర్శనం చేసుకొనేది. నిత్యమూ పండ్లూ ఫలాలూ ఇస్తూ, గుడిపూజార్లకు దక్షిణలిచ్చి సంతృప్తి పరచేది.

ఇలా ఉంటూండగా ఆ గ్రామానికి ఒకసారి లక్ష్మణదాసు అనే హరిదాసు వచ్చాడు. నలుగురు గ్రామపెద్దలవద్దకూ వెళ్ళి తన ప్రజ్ఞనూ పాండిత్యాన్నీ తెలియపరుచుకున్నాడు. జనపాల జుట్టూ, ముచ్చిగుంటలో జారుముడి వేయబడిన ఆ పిలకా, నుదుటిపై రూపాయి బిళ్ళంతకుంకుమబొట్టూ, చెవులకు కమలాలు, చేతికి స్వర్ణకంకణాలూ, గండపెండారాలూ చూసి నలుగురూ ఆయనను సాక్షాత్తూ పరమేశ్వరునితో పోల్చుకొని, మహాభారత కాలక్షేపము కావింపమన్నారు. రంగమ్మగారుకూడా, ఆయనకు తన యింట ఆతిథ్యమిచ్చి వూరివారు 'భారతకథ' చెప్పమన్న తీర్మానాన్ని బలపరచింది.

రంగనాథస్వామి కోవెలలో బ్రహ్మాండమైన పందిరివేసి, ఆడవాళ్ళకూ, మగవాళ్ళకూ వేర్వేరు స్థలాల నేర్పరచి, సంరంభంతో ఏర్పాట్లు చేశారు.

ఏకాదశీ పర్వదినం రోజున భారతకథాకాలక్షేపానికి వుపక్రమించారు లక్ష్మణదాసుగారు. ఆ గ్రామంలో పిన్నలూ, పెద్దలూ ఎల్లరూ, విచ్చేశారు, ఒక్క రంగయ్యమినహాగా. దాసుగారు శ్రావ్యంగా పాడుతూ ద్వంద్వార్థమిచ్చే పదాలను ప్రయోగిస్తూ, మధ్య మధ్య హాస్యరసాన్నొలకబోస్తూ మనోహరంగా హరికథాగానాన్ని చేస్తున్నారు. హరికథ బాగుందని, దాసుగారికీర్తి బాలభానునికిరణకాంతుల రీతిగా నలుదెసలా వ్యాపించింది. ఆనాటికానాటికి జనం విపరీతంగా వస్తున్నారు.

ఈలాగున నిరాఘాటంగా హరికథ సాగిపోతోంది. ఇరువదిరోజులకు పాండవుల అజ్ఞాతవాసము వరకూ వచ్చింది. విరాటరాజు కొలువులో పంచపాండవుల వింతవర్తనలను అమోఘంగా వర్ణిస్తున్నారు లక్ష్మణదాసుగారు.

రంగమ్మ ఆనందానికంతేలేదు. భర్తను పోరింది. హరికథ మంచి రసకందాయములో ఉంది. నేటిరాత్రి మంచి కథపట్టుంది. వెళ్ళిరమ్మని పోరింది. రంగయ్య వెళ్ళతేనని వెనుకంజవేస్తున్నా భార్యపోరువల్ల వెళ్లక తప్పలేదు. అడ్డుమాట చెప్పటానికి యోచన తట్టక, "నాకు నిద్దర ఆగదే" అన్నాడు.

ఆమె ఏలాగయినా, ఆనాడు భర్తను హరికథకు పంపించితీరాలనుకొంది. "నేను టీ పెట్టిస్తాను త్రాగి వెళ్ళండి" అంది. అతను 'టీ త్రాగితే నిదుర ఆగదు సరికదా, బ్రహ్మాండంగా నిదురపడుతుంద

★ భక్తిసాధన ★

న్నాడు. "అయితే శనగలు పోగి చిస్తాను; నిద్రవచ్చినప్పుడల్లా నోట్లో ఒక్కొక్కగింజ వేసుకుతింటూండ" మన్నది.

అందుకు సరే అన్నాడు. అసలు రంగయ్యకి శనగలంటే చాలా యిష్టం. పచ్చిశనగలే పరమాన్నముగా తలచి నెమరువేసేవాడు- అందులోనూ భార్య పోగచిపెడ తానంటే-వద్దనగలడా! తప్పకుండా శనగలుగురించేనా హరికథకు వెళ్లాలనుకొన్నాడు; విఘ్నేశ్వరునిమీద భక్తా, ఉండ్రాళ్లమీద భక్తా అన్నట్లు—

రోజూ రాత్రి ఏడు గంటల వరకూ ఉంచే కొట్టును ఆరుగంటలకే కట్టివేశాడు. తిన్నగా యింటికి వచ్చాడు. రంగమ్మ భర్త రాగానే అన్నం వడ్డించింది. భోజనం చేసిన పిమ్మట శనగలు మూటకట్టి యిచ్చింది దాసుగారు ఏమికథ చెప్పారో, అది యింటికివచ్చి తనకు చెప్పాలంది. ఆ షరతుకు అంగీకరించి రంగయ్య హరికథకు వెళ్లాడు.

అక్కడంతా అతనికి వింతగా తోచింది. శుభ్రంగా మంచి జాగా చూసుకొని, స్తంభాని కానుకొని కూర్చున్నాడు. నలుగురూ కథవినటానికివస్తున్నారు వచ్చేవాళ్లనందర్నీ వింతగా చూస్తూ, శనగల మూట విప్పుకు కూర్చున్నాడు రంగయ్య. ఒక్కొక్క గింజే వలుచుకొని తినటమారంభించాడు. వచ్చినవాళ్లందరూ రంగయ్య వింత ప్రవర్తనపరికిస్తూ, దాసుగారు రావటం చూసి కూర్చొన్నారు. హరికథా సభాస్థలిని అంతవరకూ చూసి రంగయ్య నిద్రపోయాడు. మరల దాసుగారు మంగళహారతి గీతాన్ని ఆలాపిస్తూంటే, మృదంగం, వాయులీనం మధురంగా హెచ్చుస్థాయిలో వాయిస్తూంటే రంగయ్యకు మెళకువ వచ్చింది. అందరూ , లేచి వెళ్ళడం చూశాడు.

అందరితోపాటు తనూ యింటికి వచ్చేశాడు. సుమారు రాత్రి ఒంటిగంటయింది. భార్యను పిలవగానే తలుపుతీసింది. కాళ్లు కడుక్కొని మంచంమీద నడుంవాల్చాడు.

దాసుగారు కథ ఏమిచెప్పారో అనే కౌతూహలం కొద్దీ "ఇవ్వాళేం కథ చెప్పారండీ?" అని అడిగింది.

అసలు కథ ఏమైనా వింటేగా భార్యతో చెప్పటానికి! శుభ్రంగా శనగలు ఫలహారంచేసి పడుకొన్నవాడికి కథ ఏమితెలుస్తుంది? మళ్ళీ భార్య తిరుగ ప్రశ్న వేసేసరికి సమాధానం చెప్పక తప్పదనే ఉద్దేశ్యంతో—దాసుగారు హరికథావేదికపై నుంచున్నట్లుగా మంచముమీద నుంచొని, "వస్తున్నారు, వస్తున్నారు, వస్తున్నారూ," అని ఒక చరణం పాడటం మొదలుపెట్టాడు. సరిగా ఆ సమయంలోనే రంగయ్యఇంటికి కన్నంవేయాలని దొంగలు వస్తున్నారు.

రంగయ్య "వస్తున్నారు, వస్తున్నారు" అని బిగ్గరగా పాడగానే వస్తున్నట్లు చూశాడేమోనని దొంగలు భయపడి పెరటిలో ఒక కొబ్బరిచెట్టు మొదట దాగి కూర్చున్నారు.

సరే హరికథలోకి జనంవస్తున్నారని పాడినతర్వాత, జనమంతా కూర్చొనేవరకూ శనగలు తింటూ మెళకువగా ఉన్నాడుకాబట్టి,— "కూర్చున్నారు, కూర్చున్నారు, కూర్చున్నారు"అని రెండవచరణం పాడాడు రంగయ్య. ఇది వినగానే దొంగలు మరీ హడలెత్తిపోయారు. 'మనం రావటమూ చూశాడు, కూర్చోవటమూ చూశాడు. వీడు మెలకువగానే ఉన్నాడు. కన్నంవేయటం, దోచుకోవటం కుదరదు" అనుకొన్నారు. నలుగురుదొంగలూ వెళ్లిపోదామనుకొని తాము తెచ్చుకొన్న పరికరాలన్నీ యథారీతిగా సంచిలోపెట్టుకొని, భుజాన వేసుకొని వెళ్ళిపోతున్నారు.

రంగయ్య హరికథ వినటానికి వచ్చినవాళ్లు కూర్చోవడం చూశాడు; మళ్లీ దాసుగారు మంగళహారతి పాడుతుంటేగాని మెళకువ రాలేదుకదా—! మెళకువ వచ్చి చూసేసరికల్లా జనం వెళ్ళిపోవటం కనిపించింది. కాబట్టి, "వెడుతున్నారు, వెడుతున్నారు, వెడుతున్నారు." అని మూడోచరణం పాడేశాడు. దొంగలు నిశ్చేష్టులైపోయారు. 'మనం రావటం చూశాడు, కూర్చోవటం చూశాడు, వెళ్ళిపోవడం కూడా చూశాడు; వీడెవడో దేవాంతకుడులాగున్నాడ'ని వచ్చినదారినే కాలికిబుద్ధి చెప్పారు. ఆనాడు వాళ్ళకు దురదృష్టవశాత్తూ కూర్చోవడం, వెళ్లిపోవడం, అరుగుమీద పడుకొన్న రంగయ్య పాలేరు చూశాడు.

దొంగలు వెళ్ళేటప్పుడు కుక్కలు మొరగటం విని, రంగమ్మ బయటకు వచ్చింది. దొంగలు పారిపోవడం చూసింది.

వీధిలో నుంచే "ఏమండోయ్: మన యింటికి కన్నం వేయటానికి వచ్చిన దొంగ లెట్లా పారిపోయారో చూశారా—" అంది రంగమ్మ.

అంతవరకూ బిక్కుబిక్కుమంటూ పడుకొన్న పాలేరు కాస్త ధైర్యం తెచ్చుకొని "అయ్యగారింత క్రితమే దొంగలు రావటం చూశారమ్మా" అన్నాడు.

"నేను చూడలే" దంటూ రంగయ్య బయటకు వచ్చాడు.

అప్పుడు దొంగలొచ్చిన వేళకు సరిగా 'వస్తున్నా'రని రంగయ్య పాడటం, కూర్చొనేసరికి 'కూర్చొన్నారు'అని పాడటం, వెళ్ళేటప్పుడు 'వెడుతున్నా'రని పాడటం, అంతా సవిస్తరంగా చెప్పాడు, పాలేరు.

రంగయ్యగారు ఆశ్చర్యపోయాడు. భార్యను మభ్యపెట్టుదామనే ఉద్దేశ్యంతో పాడితే, అది దొంగలనుండి రక్షింపబడటానికుపయోగించిందనుకొన్నాడు.

భర్తవాలకాన్ని చూసి, అతనికి భగవంతునిమీద భక్తి పుట్టగొల్పుదామనే ఉద్దేశ్యముతో—"మీరు గుడికి వెళ్లి హరికథ వినకపోయినా, ఆ కొంతసేపూ గుళ్లో కూర్చొని వచ్చినందు కెంత పుణ్యం సంపాదించుకు రాగల్గేరో గమనించారా?" అంది.

రంగయ్యగారికి లోలోపల ఆశ్చర్యంతోపాటు, భగవద్భక్తికూడా పుట్టుకువచ్చింది. నాటినుంచీ రంగయ్య మహాభక్తుడయ్యాడు. ★

(35-వ పేజీ తరువాయి)

టిరి, మీ పేరేమి,అంతా చెప్పండి. అంతలోపల్నే, మా ఆవిడ వచ్చేస్తుంది.

దేవి: నరుడా! ఏమి నీకోరిక?

రామ: (విసుగుతో) అబ్బే! మీకు, కాస్త ఓపిక లేదూ, దేవీ?

దేవి: నరుడా! ఏమి నీకోరిక?

రామ: నేను, నరుడ్నే లే, దేవీ! కాకపోతే, రాక్షసుడ్నేమీ కాను.

దేవి: నరుడా! ఏమి నీకోరిక?

రామమూర్తి కోపంతో, హాయ్యింటివైపు తిరిగి, "ఏయ్ సరోజా! కాస్త పరుగెత్తిరావే. దేవి డబ్భైమైళ్ల స్పీడులోవుంది. దేవి ప్రత్యక్షమైనా, నీవు ప్రత్యక్షమయ్యేది కష్టంగావుందే!" అని విసుగుతో దేవివైపు తిరుగుతాడు.

దేవి: నరుడా! ఏమి నీ కోరిక?

రామ: మీది కట్టైనోరయ్యింకె, ఎప్పుడో పగిలిపోను అనే విషయం తెలుసా దేవీ?

దేవి: నరుడా! ఏమి నీకోరిక?

రామ: అబ్బ! మీనాన్న,అమ్మ, మీకు ఆ మాట తప్ప మరేమీ నేర్పలేదా?

దేవి: నరుడా! ఏమి నీ కోరిక?

రామ: అబ్బబ్బ నన్ను చంపేస్తున్నావు.

దేవి: నరుడా! ఏమి నీకోరిక?

రామ: నేను, నరుణ్ణే, తల్లీ.

దేవి: నరుడా! ఏమి నీకోరిక?

పాపం, రామమూర్తికి ఏడుపు వచ్చేస్తోంది. పెళ్ళాము రానే లేదు. ఇక తాళలేక దేవికి సాష్టాంగ ప్రణామము చేసి,

"దేవీ! తమకు, వెయ్యి నమస్కారములు. ఓ గంటసేపునుంచి నన్ను ఏడిపించేశారు. నాపెళ్లాము రానేలేదు. ఎక్కడికెళ్ళిందో ఏమో. మాకేమీ కష్టాలు లేవు. హాయిగా బ్రతుకుతున్నాం. ఇక మీరు నామీద, దయవుంచి పోయి రండి."

ఇలా అని రామమూర్తి భయంతో తలెత్తిచూచాడు. దేవి వెళ్ళిపోయింది "బతికానురా. దేవుడా !" అనుకున్నాడు.

ఫరుపుమీద పడుకొనివున్న రామమూర్తి మెలుకువవచ్చి దిగ్గున లేచి కూర్చున్నాడు: "అరె! ఇదేమి కలా? లేక దేవి ఇంకా ఇక్కడుందా?" అని కళ్ళు నులుముకొంటూ తల ఎత్తి చూచాడు. "మ్యావ్"అంటూ పిల్లిబావ పరుపు దగ్గరకు వచ్చాడు.

"ఛ! నీ తలదరగ"అంటూ లేచి పిల్లిని ఓ తన్నుతంతే ఓ మూలకు పరుగెత్తిపోయి 'గుర్'మనింది.

రామమూర్తికి కల రావడానికి కారణం వుంది. వెనుకటిరాత్రి సెకండ్ షో పాతాళభైరవి చూసి వచ్చాడు.

పాపం! దేవికి దయగలిగి ఓ మారు, రామమూర్తిని మాట్లాడించి వెళ్ళిపోయిండి. ★

రాజా - పేదా

అనువాదం:

నండూరి రామమోహనరావు

వెల రూ 2-0-0

ఆంధ్ర గ్రంథమాల, మదరాసు.